క్లుప్తంగా

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ ఆర్ ఎం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి గురువారం ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను 9959226295 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

ఫిర్యాదులకు నిరంతర కాల్ సెంటర్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్) అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా ఫిర్యాదుల స్వీకరణకు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 24 గంటలు పనిచేసే విధంగా కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి అనిల్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఈ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని ఫిర్యాదులను 08542-241311 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని వెల్లడించారు.

ఇంటింటికీ వాల్మీకి



జడ్చర్ల టౌన్: వాల్మీకి మహర్షి జయంతి పురస్కరించుకుని ఇంటింటికీ వాల్మీకి కార్యక్రమం చేపట్టినట్లు బోయ మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ బాలకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని గోప్లాపూర్‌లో వాల్మీకి ఫొటోలను పంపిణీ చేశారు. ఓటు ప్రాధాన్యతను వివరించి, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో చెన్నకిష్టయ్య, నవీన్‌కుమార్, వెంకటయ్య, యాదయ్య, శ్రీను, రాఘవేందర్, ఈదమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ట

బాలానగర్: మండలంలోని గుండేడ్‌లో బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో యజ్ఞ, యాగాలు నిర్వహించి, అష్టదిక్కుల ప్రత్యేక పూజల అనంతరం బొడ్రాయికి అభిషేకాలు నిర్వహించి ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొని పూజలు చేశారు.

దిష్టిబొమ్మలు దహనం చేయడం హేయమైన చర్య

భూత్పూర్: కాంగ్రెస్ పార్టీపై ప్రజల ఆదరణను తట్టుకోలేక, పూర్తిగా సమాచారం తెలుసుకోకుండా కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మలు దహనం చేయడం బీఆర్‌ఎస్ పార్టీ హేయమైన చర్య చేపడుతుందని టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ సాధిక్ ప్రకటనలో తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలు రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, దళితబంధు, బీసీ బంధు పథకాలు నోటిఫికేషన్ కంటే ముందు, నవంబర్ 2వ తేదీలోగా గ్రౌండింగ్ అయిన వాటిని పూర్తి చేయాలని, కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీపై ఉద్దేశపూర్వకంగానే ఎన్నికల్లో ఓడిపోతామనే భయాందోళనకు లోనై బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేయడం తగదని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

జడ్చర్ల టౌన్: మండలంలోని దేవునిగుట్టతండా, పెద్దతండా పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ యాదయ్య గురువారం పరిశీలించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో కేంద్రాల్లో ఉన్న మౌలిక సదుపాయాలు, సౌకర్యాల గురించి ఆరా తీశారు. కేంద్రం పరిధిలో ఉన్న ఓటర్ల వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల నాటికి అన్ని సౌకర్యాలు కల్పించాలని సెక్టోరియల్ అధికారులకు సూచించారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ కిరణ్ ఉన్నారు.

కురుమ యాదవులను మోసం చేసిన బీఆర్‌ఎస్



స్టేషన్ మహబూబ్‌నగర్: గొర్రెల పంపిణీ పథకం పేరుతో కురుమ యాదవులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో గొర్రెల పంపిణీ పథకం కోసం 11,500 మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 1,235 మందికి ఇచ్చారని, మిగతా వారికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గొర్రెల పంపిణీ పథకం కోసం ఒక్కొక్కరూ రూ.43,753 డీడీలు తీసి ప్రభుత్వానికి కట్టారని, వీటి డబ్బులు తిరిగి దరఖాస్తుదారులకు ఎందుకు అందజేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దరఖాస్తుదారులందరికీ గొర్రెల పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. సమావేశంలో రాములుయాదవ్, యాదయ్య యాదవ్, రాఘవేందర్ యాదవ్, కురువ నరేష్ యాదవ్, ఆంజనేయులు, శ్రీశైలం యాదవ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు ఆపేందుకు కుట్ర



దేవరకద్రలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: రైతులు, రాష్ట్ర ప్రజలపై కాంగ్రెస్ పార్టీ దుర్మార్గమైన వైఖరిని అవలంబిస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుబంధు పథకాన్ని ఆపేయాలని డిమాండ్ చేస్తూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని విమర్శించారు.

తగిన గుణపాఠం చెబుతారు..

హన్వాడ: ఏటా ప్రభుత్వం రైతులకు ఇచ్చే రైతుబంధు డబ్బులను రైతులకు ఇవ్వొద్దని కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయడం తగదని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండల నాయకులతో కలిసి మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు.

రైతు వ్యతిరేకి కాంగ్రెస్ పార్టీ..

భూత్పూర్: కాంగ్రెస్ పార్టీ రైతులకు వ్యతిరేకమని మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని చౌరస్తాలో టీపీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

దేవరకద్ర: బీఆర్‌ఎస్ నాయకులు గురువారం సాయంత్రం నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పట్టణంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తు దిష్టిబొమ్మతో ఊరేగించారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, నరేందర్‌రెడ్డి, కొండారెడ్డి, శివానంద్, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో గురువారం బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల తోపులాట..

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా, కాంగ్రెస్ నాయకులు చేరుకుని కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. అనంతరం ఇరుపార్టీల నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

బాలానగర్: బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తేనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, అభివృద్ధికి ఆటంకం ఏర్పడని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండలంలోనిహే హేమాజీపూర్, లింగారం, గాంధిపాలెం, బిల్డింగ్ తండాలలోని బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. హామీలు ఇవ్వకుండానే ప్రజా సంక్షేమం కోసం తెచ్చిన రైతు బంధు, బీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, షాదీముబారక్, మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వ వైభవం, రైతుల వద్ద ధాన్యం కొనుగోళ్లు, 24 గంటల ఉచిత విద్యుత్ అమలు చేశారన్నారు. కాంగ్రెస్‌లో ఎవరికి వారే సీఎం అభ్యర్థులని గొడవ పడటానికే సమయం సరిపోవడం లేదని, ప్రజల గురించి ఏం ఆలోచిస్తారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు కోర్టులో కేసులు వేయకపోతే పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తయ్యి కోనసీమను తలపించేదని అన్నారు. ప్రస్తుతం పాలమూరు ఎత్తిపోతల పనులతో జిల్లా సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. ఆయన వెంట టీజీసీసీ చైర్మన్ వాల్యానాయక్, ఎంపీపీ కమల, జెడ్పీటీసీ కల్యాణి, లక్ష్మణ్ నాయక్, శ్రీనివాస్‌రావు, సర్పంచ్ నాగేష్ ఉన్నారు.

కార్యకర్తలు పట్టుదలతో పనిచేయాలి



బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

మహమ్మదాబాద్: రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ సీఎం కావాలంటే ప్రతి కార్యకర్త పట్టుదలతో పనిచేయాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నంచర్లగేట్ దేశాయిపల్లిలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కష్టపడి సాధించుకున్న రాష్ట్రాన్ని ఇతరుల చేతుల్లో పెట్టి ప్రజలు నష్టాల పాలు కాకుండా చూడాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ బీఆర్‌ఎస్ సత్తా చాటాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. షేక్‌పల్లి, చౌదర్‌పల్లి, దేశాయిపల్లి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బిక్షపతి, హనీబోద్దీన్, చెంద్యానాయక్, కిష్టయ్య, గీతాపాండు తదితరులు పాల్గొన్నారు.

పీయూలో సోలార్ ప్యానెల్స్ యూనిట్



సోలార్ ప్యానెల్స్‌ను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో అడ్మినిస్ట్రేషన్ భవనంపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్స్ యూనిట్‌ను పీయూ రిజిస్ట్రార్ గిరిజ, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. రూ.60లక్షలకు పైగా ఖర్చు చేసి యూనివర్సిటీలోని అన్ని భవనాలకు విద్యుత్ సరఫరా కోసం ప్యానెల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒప్పందంలో భాగంగా నాణ్యతా ప్రమాణాల ప్రకారం ప్యానెల్స్ ఉన్నాయా లేదా అని పరిశీలించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ద్వారా పీయూలో చెల్లించే విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయని, న్యాక్‌లో గ్రేడింగ్ పెరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. వారి వెంట ఏఆర్ వెంకటేశ్వర్లు, రవికుమార్, సూర్య తదితరులు ఉన్నారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా



బాలానగర్‌లో ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలప



పెద్దాయపల్లి వద్ద ట్రాక్టర్‌లో తరలుతున్న కలప

పరిశ్రమలకు తరలిస్తున్న వైనం

బాలానగర్: వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ కలప వ్యాపారులు పట్టపగలే యథేచ్ఛగా ట్రాక్టర్లలో అక్రమంగా కలప తరలిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. వ్యాపారులు పరిశ్రమలు, అధికారులతో కుమ్మక్కై ఎలాంటి అనుమతులు లేకుండా భారీ వృక్షాలను, చెట్లను నరికి కలపను పరిశ్రమలకు, ఇటుక బట్టీలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. మండల కేంద్రం నుంచి జాతీయ రహదారి-44పై ట్రాక్టర్లలో కలప రవాణా సాగుతున్నా, సీసీ కెమెరాల ముందే తరలుతున్నా చూసిచూడనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు.

సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం..

కలప అక్రమ రవాణాపై సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికీ పలుమార్లు కలప అక్రమ రవాణాను అడ్డుకుని చర్యలు తీసుకుంటూనే ఉన్నాం. మండలంలో పలు కేసులు నమోదు చేశాం. అటవీశాఖ అధికారుల భయంతోనే అక్రమ వ్యాపారాలు తగ్గాయి. మొక్కలను కాపాడటం ప్రతి వ్యక్తి బాధ్యత.

– నరేందర్, ఎఫ్ఎస్ఓ, బాలానగర్

బాధితులకు పరామర్శ



ఆస్పత్రిలో పరామర్శిస్తున్న నాయకులు

అడ్డాకుల: మూసాపేట మండలం తిమ్మాపూర్ చెందిన నర్సింహులు రోడ్డు ప్రమాదానికి గురై జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడిని గురువారం జెడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్, లక్ష్మీనర్సింహ, సర్పంచ్ చంద్రశేఖర్, చుక్కల శేఖర్ పరామర్శించారు. అదేవిధంగా మరో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ మండల మైనార్టీ ప్రధాన కార్యదర్శి పాష తల్లిని కూడా నాయకులు పరామర్శించారు.

ఆర్థికసాయం

మండలంలోని గుడిబండకు చెందిన శ్రీనివాసులు మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని గురువారం బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి రూ.5వేలను పంపించడంతో వాటిని బాధిత కుటుంబానికి అందజేసి మృతదేహం వద్ద నివాళులర్పించారు.

సోనామసూరి ధర రూ.2,109

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో గురువారం జరిగిన ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ. 2,109, కనిష్టంగా రూ. 2,029గా ధరలు నమోదయ్యాయి. హంస ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.1981, కనిష్టంగా రూ.1,889గా పలికాయి. మార్కెట్‌కు దాదాపు వేయి బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

5న రంగోత్సవం పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ తదితరులు

పాలమూరు: విద్యార్థులలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు రెయిన్‌బో పాఠశాల ఆధ్వర్యంలో రెయిన్‌బో రంగోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మమత తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాఠశాలలో గురువారం రెయిన్ బో రంగోత్సవం-2023 పోస్టర్‌ను డీఈవో రవీందర్ ఆవిష్కరించారు. పోటీలు నవంబర్ 5న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు నవంబర్ 3 మధ్యాహ్నం వరకు పేర్లను నమోదుచేసుకోవాలని, పోటీలకు వచ్చే విద్యార్థులు తప్పక స్కూల్ ఐడీ కార్డులతో రావాలని కోరారు.

నేడు ఎస్‌జీఎఫ్ యోగా, ఆర్చరీ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు అండర్-14, అండర్-17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాస్థాయి ఆర్చరీ, యోగా క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మిగతా వివరాల కోసం జిల్లా యోగా సంఘం కార్యదర్శి బాల్‌రాజు 94402 92044, ఆర్చరీ కోచ్ జ్ఞానేశ్వర్ 90108 04720 నంబర్లను సంప్రదించాలని కోరారు.

28న మన్యంకొండ దేవాలయం మూసివేత

మహబూబ్‌నగర్ రూరల్: చంద్రగ్రహణం నేపథ్యంలో ఈనెల 28వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 29వ తేదీ ఉదయం 8 గంటల వరకు మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని మూసివేయనున్నట్లు ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజులు తెలిపారు. దైవ దర్శనానికి వచ్చే భక్తులు గమనించాలని కోరారు. 29వ తేదీ ఉదయం 10 గంటలకు దేవాలయంలో స్వామివారి కల్యాణోత్సవం యథావిధిగా జరుగుతుందని పేర్కొన్నారు.

కొమిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ మృతి

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ మున్నూర్ శ్రీనివాసులు(79) మృతి చెందారు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందగా, ప్రస్తుతం ఇంటి వద్ద ఉండి కోలుకుంటుండగా గురువారం ఉదయం అకస్మికంగా మృతి చెందారు. 2006 నుంచి 2011 వరకు ఆయన సర్పంచ్‌గా పని చేశారు. కుటుంబాన్ని బీజేపీ నాయకుడు ఎగ్గని నర్సింహులు పరామర్శించారు.

భయంతోనే విపక్షాల దుష్ప్రచారం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విపక్ష పార్టీలో ఎన్నికల ఓటమి భయంతో సామాజిక మాధ్యమాలలో తనపై కొన్ని తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టుకాడి శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరు ఎన్ని ప్రచారాలు చేసి టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉంటానని, తనను పాలమూరు ప్రజలు ఆదరిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



కారూర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అడ్డాకుల: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేశారని, త్వరలో తర్వాత వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కందూర్‌లో గురువారం రాత్రి ఆయన పర్యటించారు. గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు దేవేందర్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి సోదరులు 200 మందితో సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తుందని, బీఆర్‌ఎస్ మాటలు నమ్మి మోసపోవద్దని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, యువజన కాంగ్రెస్ మహబూబ్‌నగర్ అసెంబ్లీ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్ అన్నారు.

నవాబుపేట: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారంటీ పథకాలతోనే బీఆర్‌ఎస్‌కు వణుకు మొదలైందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కారూర్, తీగలపల్లిలో ప్రచారం నిర్వహించారు.

రైతులకు ఒకే విడతలో రుణమాఫీ..

హన్వాడ: రైతులకు ఒకే విడతలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణయ్యయాదవ్ పేర్కొన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని కొనగట్టుపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ప్రాణమున్నంత వరకు ప్రజాసేవే లక్ష్యం



రాజాపూర్‌లో జన్మదిన వేడుకల్లో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

రాజాపూర్: పదువుల వస్తుంటాయి.. పోతుంటాయి.. ప్రాణం ఉన్నంత వరకు ప్రజా సేవ లక్ష్యమని డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం రాయపల్లి, ముదిరెడ్డిపల్లి, తిర్మలాపూర్, రాజాపూర్, రంగారెడ్డిగూడలో ఆయన జన్మదిన వేడుకలను అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. తిర్మలాపూర్‌లో కేక్ కట్ చేశారు. గ్రామస్తులు ర్యాలీగా తీసుకెళ్లి గజమాలతో సన్మానం చేశారు. మండలం కేంద్రంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కొప్పెరిబచ్చిరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వేడుకలను నిర్వహించిన అనంతరం మహిళలకు, పంచాయతీ కార్మికులకు, చీరలు, దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంగీత, నాటక అకాడమి మాజీ చైర్మన్ బాద్మిశివకుమార్, ఎంపీపీ సుశీల, శ్రీధర్‌గౌడ్, సాయిధర్‌గౌడ్, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, కృష్ణయ్యగౌడ్, రామకృష్ణగౌడ్, శేఖర్‌గౌడ్, నర్సింహులు, వెంకటయ్యగౌడ్, ఆనంద్‌గౌడ్, అల్లె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: మండలంలోని పెద్దాయపల్లిలో వద్ద డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభాకర్ రెడ్డి మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. జీసీసీ చైర్మన్ వాల్యానాయక్, పలువురు ప్రముఖులు, నాయకులు తరలివచ్చి పట్ల ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

జోరుగా బీఆర్‌ఎస్ ప్రచారం



దేవరకద్రలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



సుక్యాతండాలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దేవరకద్ర: మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని నాయకులు ఓటర్లకు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జట్టి నర్సింహారెడ్డి, వెంకటేశ్, శివానంద్, బాల్‌రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజల చూపు బీఆర్‌ఎస్ వైపు ఉందని మండలనాయకులు అన్నారు. గురువారం మండలంలోని కోత్లాబాద్‌లో ప్రచారం నిర్వహించారు. నారాయణపేట నియోజకవర్గ అభ్యర్థి ఎస్. రాజేందర్‌రెడ్డిని గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో మాధవులు, మాధవరెడ్డి, నర్సింహులు, సురేష్, మహమూద్‌పాషా, ఖాజాపాషా, గొల్లవెంకటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీతోనే అభివృద్ధి..

భూత్పూర్: బీఆర్‌ఎస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుందని ఆల మంజుల అన్నారు. గురువారం మండలంలోని పోతులమడుగు పంచాయతీలోని సుక్యాతండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గడప గడపకు తిరుగుతూ మేనిఫెస్టో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, రమేష్‌చందర్, బాల్‌కోటి, వెంకట్రాములు ఉన్నారు.

నవాబుపేట: బీఆర్‌ఎస్ చేపట్టిన పథకాలు దేశంలో అగ్రగామిగా నిలిచాయని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డిలు అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు అమ్మపూర్, లింగంపల్లిలో ఇంటింటికీ వెళ్లి జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గ్రామాలకు చేసిన అభివృద్ధిని వివరించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

హన్వాడ: బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని టంకరలో 100మంది ఓటర్ల ఇన్‌చార్జ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలే మనకు శ్రీరామరక్ష అని, చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని కోరారు.

ఆధార్ కేంద్రం వద్ద రద్దీ



యూనియన్ బ్యాంక్ ఆధార్ కేంద్రం వద్ద ఎగబడిన ప్రజలు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని రంగారావుతోటలో ఉన్న యూనియన్ బ్యాంకులోని ఆధార్ కేంద్రం వద్ద గురువారం సాయంత్రం రద్దీ నెలకొంది. దసరా సెలవుల కారణంగా కొద్దిరోజులుగా ఎవరూ రాకపోగా, గురువారం ఒక్కసారిగా ప్రజలు తరలి రావటంతో ఇబ్బందులు తలెత్తాయి. ఆధార్ అప్‌డేషన్ కోసం పిల్లలను తీసుకుని కేంద్రానికి వచ్చారు. ప్రతిరోజు 50నుంచి60మాత్రమే కేంద్రంలో అప్‌డేషన్ అవుతుండటంతో నిర్వాహకులు సైతం ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. శుక్రవారం అప్‌డేషన్ కోసం గురువారం సాయంత్రం 60టోకెన్లు జారీ చేశారు. పోస్టాఫీసులో కేంద్రం ఏర్పాటు చేయగా అక్కడ రద్దీ ఎక్కువై తోపులాట, ఉద్రిక్తత చోటు చేసుకోవటంతో తాత్కాలికంగా నిలిపివేశారు. పట్టణంలో ఆధార్ అప్‌డేషన్ కోసం కేంద్రాలు మరిన్ని ప్రారంభించాలని కోరుతున్నారు.